సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



గృహలక్ష్మి దరఖాస్తుల సర్వే

రుద్రంగి(వేములవాడ): మానాలలో గృహలక్ష్మి కోసం వచ్చిన దరఖాస్తులపై అధికారులు గురువారం సర్వే చేపట్టారు. ఎంపీడీవో శంకర్, ఎంపీవో సుధాకర్ ఉన్నారు.



శ్రావణపూజలు... మొక్కులు షురూ

వేములవాడ: శ్రావణమాసం ప్రారంభం కావడంతో రాజన్నకు భక్తులు శ్రావణపూజలు, మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం 15 వేల మంది రాజన్నను దర్శించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలులు వేగంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

అవకాశమిచ్చి... ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: నిత్యం ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజాసమస్యలపై గొంతు విప్పుతున్న తనకు ఒకసారి అవకాశమిచ్చి ఆశీర్వదించండి అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడలోని 8, 9, 22, 28వ వార్డులలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. రాజన్న గుడి అభివృద్ధి పేరుతో ప్రభుత్వ నిధులు కేటాయించకుండా, గుడి నిధులను మాత్రమే వెచ్చిస్తున్నారన్నారు. ఏటా రూ.100 కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. దళితులకు మూడెకరాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఏవని అడిగారు. బాలికల జూనియర్, డిగ్రీ కాలేజీల ఊసేలేదన్నారు. అధికారంలోకి రాగానే రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తూ.. రూ.2,500 క్వింటాల్ ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చిలుక రమేశ్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, దూరం భూమేశ్, షేక్ రియాజ్, వనపర్తి శంకర్, మర్రిపల్లి రాజు, గంగిశెట్టి మహేశ్, ఎడ్ల శ్రీనివాస్, జనగామ మహేశ్, సూగూరి లక్ష్మి, తోట లహరి తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగిలో వ్యవసాయ విద్యార్థులు



రుద్రంగిలో వ్యవసాయ విద్యార్థులు

రుద్రంగి(వేములవాడ): జిల్లెల్లలోని బాబూ జగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రుద్రంగిలోని రైతువేదికలో గురువారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం, గ్రామీణ విశ్లేషణాత్మక తులనం నిర్వహించారు. స్థానిక రైతులు పండించే పంటలు, గ్రామ వనరులు, గ్రామీణ సమస్యలను పటాల ద్వారా వివరించారు.

'గృహలక్ష్మి'లో రూ.6 లక్షలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సోమ నాగరాజు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గృహలక్ష్మీ పథకంలో నిరుపేదల ఇంటి నిర్మాణాలకు రూ.6 లక్షలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నాగరాజు కోరారు. మండలంలోని రాళ్లపేటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. పెరిగిన స్టీలు, సిమెంట్, ఇసుక, కంకర ధరల నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.3లక్షలు సరిపోవన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీలో చాలా మందికి అన్యాయం జరిగిందన్నారు. కౌలు రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు సబ్సిడీపై అందించాలని కోరారు. 57 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ అందించాలనే డిమాండ్‌తో ఈనెల 21న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలరాజు, నాగయ్య, చంద్రం, భిక్షపతి, బాలమల్లు పాల్గొన్నారు.

వ్యవసాయ గణనతో అభివృద్ధి ప్రణాళిక



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న సీపీవో

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం చేపట్టిన వ్యవసాయ గణనతో భవిష్యత్ అవసరాల కోసం ప్రణాళికలు రూపొందించడం జరుగుతోందని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్‌చారి పేర్కొన్నారు. మోహినికుంటలో 11వ వ్యవసాయ గణన నమోదు విధానాన్ని గురువారం సీపీవో పరిశీలించారు. సన్న, చిన్నకారు రైతులతోపాటు మధ్యతరగతి రైతులు, పెద్ద రైతుల వివరాలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లకో సారి జరిగే వ్యవసాయ గణనను పారదర్శకంగా చేపట్టాలన్నారు. నమోదుతో వచ్చిన సమాచారం మేరకు ప్రభుత్వం రైతుల అవసరాలను గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఎంపీఎస్‌వో గాజుల బాలకృష్ణ, ఏఈవో రేవతి ఉన్నారు.



ఇది సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ సమీపంలో జిల్లా కేంద్రం వైపు వెళ్లే రోడ్డు. ఇటీవల రోడ్డును విస్తరించి తారు రోడ్డు వేశారు. కానీ అడుగుభాగంలో మట్టికుంగిపోయి, కంకర రోడ్డు కదిలిపోయి... ఇలా తారురోడ్డు పగుళ్లు బారింది. నెర్రెలు బారిన పగుళ్లను కప్పిపుచ్చేందుకు మళ్లీ పైపై పూతలు పెడుతున్నారు. పది కాలాలపాటు ఉండాల్సిన రహదారి ఇలా చేస్తే మన్నికపై అనుమానాలు కలుగుతున్నాయి.



ఇది సిరిసిల్ల కొండాలక్ష్మణ్‌బాపూజీ (విద్యానగర్) విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు నిర్మించే మొదటి బైపాస్ రోడ్డు పనులు. 2021 డిసెంబరులో ప్రారంభించిన ఈ రోడ్డు పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. వాస్తవానికి 2022 మే 25 నాటికి బైపాస్ రోడ్డును ఫోర్‌లేన్లుగా విస్తరించాలి. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ... పనుల్లో జాప్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో విస్తరణ పనులు నిదానంగా సాగుతున్నాయి.

బైపాస్.. టైంపాస్ !

- ఏడాదిన్నరగా సా..గుతున్న మొదటి బైపాస్‌రోడ్డు
- మళ్లీ గడువు కోరుతున్న కాంట్రాక్టర్
- నిర్మాణ దశలోనే బీటీ రోడ్డుకు పగుళ్లు
- కోతకు గురైన సైడ్‌బర్మ్స్
- పెండింగ్‌లో సెంట్రల్ లైటింగ్ పనులు



అర్ధంతరంగా ఆగిన బైపాస్‌రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులు



ఇది బైపాస్ రోడ్డులో మూలమలుపు వద్ద రోడ్డు విస్తరణ పని. సిరిసిల్ల బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డు విస్తరణ పూర్తి స్థాయిలో జరగలేదు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు పూర్తి స్థాయిలో వెడల్పు చేయగా.. కొన్ని చోట్ల వెడల్పు చేయకుండానే వదిలేశారు. దీంతో రోడ్డు పక్కనే ఉన్న భూమి పట్టాదారులు ఏకంగా రాతి తెట్టెను కట్టుకుని ఇక రోడ్డు విస్తరించకుండా కట్టడి చేశారు.

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రం చుట్టూ రోడ్లను విస్తరిస్తున్నారు. నిధులు పుష్కలంగా మంజూరవుతున్నా పనులు మాత్రం నత్తకే నడక నేర్పేలా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించే ఇంజినీర్లను సైతం తరచూ మార్చడంతో పనులు నెమ్మదించాయి. అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లు కావడంతో పర్యవేక్షక ఇంజినీర్లు సైతం పనుల్లో వేగం పెంచలేకపోతున్నారు. ఫలితంగా జిల్లా కేంద్రంలో మొదటి బైపాస్ రోడ్డు పనులు నిర్మాణ అగ్రిమెంట్ గడువు ముగిసినా పనులు మిగిలే ఉన్నాయి. విద్యానగర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్‌పై అందమైన పూల మొక్కల పెంపకం వంటి ప్రతిపాదనలతో ప్రారంభించిన పనులు ఏళ్లుగా సాగుతూనే ఉన్నాయి. హైదరాబాద్-వేములవాడ ప్రధాన రహదారి కావడంతో దైవదర్శనానికి వచ్చే భక్తుల రద్దీతో బైపాస్ రోడ్డు బిజీగా ఉంటుంది. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు నిర్మాణంలో జాప్యం జరగడం, నాసిరకంగా పనులు చేయడం ఆందోళన కలిగిస్తుంది.

ఇది మొదటి బైపాస్ స్వరూపం

- కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు
- రోడ్డు పొడవు : 4 కిలోమీటర్లు
- గతంలో ఉన్న రోడ్డు : డబుల్ రోడ్డు
- ప్రస్తుతం విస్తరించే రోడ్డు : ఫోర్‌లేన్
- నిర్మాణ వ్యయం : రూ.35 కోట్లు
- నిర్మాణ సమయం : 10 నెలలు
- ఇంకా మిగిలిన పనులు : 35 శాతం

డిసెంబరు వరకు గడువు కోరారు

మొదటి బైపాస్ రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. నిర్మాణ దశలో వర్షాలు, వరదలతో పగుళ్లు వస్తాయి. వాటిని సరిచేస్తాం. ఇప్పటికే రోడ్డు నిర్మాణ గడువు ముగిసింది. మళ్లీ డిసెంబరు వరకు కాంట్రాక్టర్ గడువు కోరారు. రోడ్డు విస్తరణ చేసి, బైపాస్‌రోడ్డును పూర్తి చేయిస్తాం.

– శ్యామ్‌సుందర్, ఆర్‌అండ్‌బీ ఈఈ

తండాల్లో సాగుసంబురం

- నెరవేరిన దశాబ్దాల కల
- దర్జాగా పోడుభూముల సాగు
- 2,858 ఎకరాల్లో పచ్చని పైర్లు





పంట పొలంలో నిల్చున్న గిరిజన రైతు ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లిచెరువుతండాకు చెందిన మాలోతు లలిత. ప్రభుత్వం ఇచ్చిన పోడుపట్టాతో తనకు వచ్చిన రెండెకరాలలో వరిపంట సాగుచేసింది. గతంలోనూ అదే భూమిలో పంటలు సాగు చేసినప్పటికీ అప్పుడు పట్టాలు లేక భయం.. భయంగా పనులు చేసేది. ఇప్పుడు పోడుపట్టా రావడంతో దర్జాగా సొంత భూమిలో పంటను సాగు చేసుకొని సంబరపడుతుంది.



ఈ ఫొటోలో రైతు పేరు సునావత్ రాజు. ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువుతండా. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో అడవిని చదును చేసుకొని దశాబ్దకాలంగా పంటలు సాగు చేసుకునేవాడు. అటవీ అధికారుల వేధింపులతో ఇబ్బందులకు గురయ్యాడు. కొంత కాలం సాగును నిలిపివేశాడు. ప్రభుత్వం పోడుపట్టాల పంపిణీలో భాగంగా రాజుకు రెండున్నర ఎకరాలకు హక్కుపత్రాలు వచ్చాయి. ఇప్పుడు సంతోషంగా పంటలు సాగుచేసుకుంటున్నాడు.



ఈమె గుంటపల్లిచెరువుతండాకు చెందిన గిరిజన మహిళా రైతు మాలోతు మంజుల. ఎలాంటి వ్యవసాయ సాగు భూములు లేక కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేది. తండాలో అందరిలాగానే మంజులకు కూడా ఎకరం అటవి భూమిని చదునుచేసుకుని అందులో పంటను పండించేది. పోడుపట్టాల పంపిణీలో భాగంగా అర్హులను గుర్తించే కార్యక్రమంలో మంజులకు కూడా అవకాశం దక్కింది. ఎకరం భూమికి మంత్రి కేటీఆర్ చేతులమీదుగా పట్టాను అందుకొని సాగుచేసుకుంటుంది.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): దశాబ్దాల కాలంగా పోడుపట్టాల కోసం ఎదురుచూసిన గిరిజనుల ఆశలు ఎట్టకేలకు నెరవేరాయి. అటవీ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నారని ఫారెస్ట్ అధికారులు, పోడురైతుల మధ్య అనేక సందర్భాల్లో ఘర్షణలు జరిగి కేసుల పాలైన సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి పోడుభూములను సాగుచేసుకుంటున్న వారికే పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా.. పట్టాలు అందుకున్న రైతులు నేడు తలెత్తుకొని పంటలను సాగుచేసుకుంటున్నారు. మొన్నటి వరకు భయం.. భయంగా భూములను సాగుచేసుకున్న గిరిజన రైతుల్లో నేడు సాగు సంబురం వెల్లివిరుస్తోంది. ఏ తండాకు వెళ్లిన పోడుభూముల్లో కలుపు దశకు వచ్చిన వరి పైర్లు భూమికి పచ్చని రంగేసినట్టు హరితవిప్లవాన్ని తెచ్చాయి.

1,614 మంది రైతులు..2,858 ఎకరాలు

జిల్లా వ్యాప్తంగా 62 గ్రామాల్లో పోడుభూములను సాగుచేసుకుంటున్న 1,614 మంది రైతులకు ప్రభుత్వం 2,858 ఎకరాలకు పట్టాలను అందించింది. దశాబ్దాల కాలంగా గిరిజన రైతులు పోడుభూములను సాగుచేసుకుంటుండగా హక్కుపత్రాలు లేక ఇన్నాళ్లు అనేక ఇబ్బందులు పడ్డారు. వేసిన పంట చేతికొస్తుందో..లేదో తెలియని అయోమయ పరిస్థితులు ఉండేవి. ప్రభుత్వం అర్హులను గుర్తించి పోడుపట్టాలు అందించడంతో వారు నేడు ఆత్మాభిమానంతో పంటలు సాగుచేసుకుంటున్నారు. దీనికితోడు పోడురైతులకు చేయూతనివ్వాలనే సంకల్పంతో ప్రభుత్వం రైతుబంధును వర్తింపజేయడంతో సాగు పెట్టుబడులు అందాయి. రైతుబీమా కూడా వర్తిస్తుండడంతో వారి కుటుంబీకులు మనోధైర్యంతో బతుకుతున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



పోడుభూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. సాగుచేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలు లేక ఇంతకాలం ఎదురుచూశారు. తెలంగాణ ప్రభుత్వం మారుమూల తండాలను గ్రామపంచాయతీలుగా మార్చి గిరిజనుల గూడేల్లో వెలుగులు నింపడమే కాకుండా పోడురైతులకు పట్టాలు ఇచ్చి వారి బతుకులకు భరోసానిచ్చిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు కృతజ్ఞతలు.

– మాలోతు సునీత, గుంటపల్లిచెరువుతండా సర్పంచ్

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- ఇంటి అనుమతి కోసం రూ.20వేలు తీసుకుంటూ చిక్కిన వైనం



బాధితుడు బండారి ఓవెలు



ఏసీబీకి చిక్కిన కార్యదర్శి జగదీశ్వర్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

కోనరావుపేట(వేములవాడ): ఇంటి అనుమతి కోసం రూ.20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పంచాయతీ కార్యదర్శి చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో బండారి ఓవెలు ఇల్లు నిర్మిస్తున్నాడు. ఇంటి అనుమతి కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్‌ను సంప్రదించగా రూ.30వేలు డిమాండ్ చేశాడు. ఈనెల 14న రూ.10వేలు చెల్లించాడు. మిగతా రూ.20 వేలు గురువారం కార్యదర్శికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యదర్శి జగదీశ్వర్‌ను అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ ఈ కేసును పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇందులో ఇంకా ఎవరెవరి పాత్ర ఉందన్న విషయాలను తెలుసుకుంటామన్నారు. గతంలో ఇచ్చిన అనుమతులపై కూడా విచారణ చేపడతామన్నారు. దాడుల్లో ఏసీబీ సీఐ జాన్‌రెడ్డి, ఎస్సైలు రవీందర్, రాము, తిరుపతి ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



బహుమతి అందజేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్లఅర్బన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్లలోని కుసుమ రామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో యాంటి డ్రగ్ క్లబ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలను నిర్మూలించే బాధ్యత నేటితరం విద్యార్థులపై ఉందన్నారు. మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. గంజాయి సమాచారం ఉంటే డయిల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం యాంటీ డ్రగ్ పెయింటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, హెడ్‌మాస్టర్ పరబ్రహ్మమూర్తి ఉన్నారు.

21న ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్‌లో ఖాళీల భర్తీకి ఈనెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి జాక్విలిన్ ప్రకటనలో తెలిపారు. అర్హులైన బాలురు, బాలికలు 21న టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ చిన్నబోనాల కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని కోరారు.

మాతృత్వ రక్షణకు హెల్ప్‌డెస్క్

- కలెక్టర్ అనురాగ్ జయంతి



హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభిస్తున్న లేడీ డాక్టర్, కలెక్టర్

సిరిసిల్ల: తల్లీబిడ్డల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని, జిల్లాలో మాతృత్వ రక్షణకు హెల్ప్‌డెస్క్ ప్రారంభించామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను గురువారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఉత్కృష్టమైన వైద్యసేవలందిస్తున్నట్లు వివరించారు. డెలివరీకి సిద్ధంగా ఉన్న మహిళలకు నెల రోజుల ముందు నుంచే ఫాలోఅప్ చేసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ చేయించుకునేలా సంసిద్ధులను చేస్తామన్నారు. హైరిస్క్ కేసులకు వారం వారం వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లు ఆరా తీస్తారని, సహజ కాన్పులతో కలిగే ప్రయోజనాలు వివరించాలని కలెక్టర్ సూచించారు. గర్భిణుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 18004253333, మొబైల్ నంబర్ 73965 53254, 91218 42941 లలో సంప్రదించాలని కోరారు. డీఐవో ఎం.మహేశ్, వైద్యులు నాయిమ జాన్, ఏవో శ్రీనివాస్, డీపీఎంవో సురేశ్, డీపీవో ఉమా, డీడీఎం కార్తీక్, బాలయ్య పాల్గొన్నారు.

ఆధునీకరించే ఔత్సాహికులకు ప్రోత్సాహం

- చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు సాగర్

సిరిసిల్ల: జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను వస్త్రోత్పత్తి రంగంలో పోత్సహిస్తున్నామని చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకుడు మిట్టకోల సాగర్ గురువారం తెలిపారు. ప్రపంచ స్థాయిలో వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న ఆధునిక విధానంలో మరమగ్గాలను, ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించే వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి సిరిసిల్లలో పర్యటించి వెళ్లిన నేపథ్యంలో వస్త్రోత్పత్తి రంగంలో ఆధునీకరణకు ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తున్నారని వివరించారు. వారం రోజుల్లో ఔత్సాహికులు డిటేయిల్ ప్రాజెక్టు రిపోర్టులను సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్‌లో సమర్పించాలని కోరారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం

- మధ్యమానేరులో బోటింగ్..
- జిల్లా ఆస్పత్రిలో 130 అదనపు బెడ్స్ ప్రారంభం
- సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ
- నేడు సిరిసిల్లలో మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పర్యటన

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రాంత ప్రజలకు పర్యాటక అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. పాపికొండల అందాలు.. జల సవ్వడులు.. ఇక్కడే చూసి తరించేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రం శివారులోని మధ్యమానేరు బ్యాక్‌వాటర్‌లో కరకట్ట వద్ద బోటింగ్‌ను శుక్రవారం రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించనున్నారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నాంపల్లిగుట్ట అందాలతోపాటు మధ్యమానేరు అందాలను చూసేలా బోటింగ్ వసతిని రాష్ట్ర పర్యాటకశాఖ కల్పిస్తుంది.

జిల్లా ఆస్పత్రిలో అదనపు బెడ్స్

జిల్లా ఆస్పత్రిలో రూ.6.80కోట్లతో 130 అదనపు బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీ ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో 330 పడకలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు కీమోథెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆస్పత్రి పైభాగం రూ.34లక్షలతో 40 కేవీ సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి అవసరమైన విద్యుత్ ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అవుతుంది.



కరకట్ట వద్ద బ్యాక్ వాటర్‌లో బోటింగ్

సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

సిరిసిల్లలోని బైపాస్‌రోడ్డులో నర్సింగ్ కాలేజీ కూడలి వద్ద సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని మంత్రులు ఆవిష్కరిస్తారు. ఈమేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ ఆయాజ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు రాపెల్లి దినేశ్, యెల్దండి దేవదాస్, టీపీవో అన్వార్, ఇంజినీర్లు గురువారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

ఇదీ మంత్రుల పర్యటన షెడ్యూల్

జిల్లాలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు సిరిసిల్ల బైపాస్‌రోడ్డులో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని మంత్రులు ఆవిష్కరిస్తారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో మంత్రులు మాట్లాడుతారు. సాయంత్రం 4 గంటలకు మధ్యమానేరు కరకట్ట వద్ద పర్యాటకశాఖ ఏర్పాటు చేసిన నూతన బోటును ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు బైపాస్‌రోడ్డులో కే-కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు జిల్లా ఆస్పత్రిలో 40 కేవీ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ను, 130 అదనపు బెడ్స్‌ను, డే కేర్ కీమోథెరపీ సెంటర్‌ను ప్రారంభిస్తారు.

క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి



షూస్ పంపిణీ చేసిన సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సత్తాచాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం కోరారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాకారులకు రూ.15వేల విలువ చేసే స్పోర్ట్స్ షూస్‌ను గురువారం పంపిణీ చేశారు. సెక్రటరీ నాయిని భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాటి దేవయ్య, పెంజర్ల రవి, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మహేందర్‌రెడ్డి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని బాబాయి చెరువుతండాకు చెందిన పలువురు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేదర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, ఎస్టీ మోర్చా నాయకులు గుగులోత్ హరిలాల్‌నాయక్, మండల యువజన విభాగం ఉపాధ్యక్షుడు బొంగు తిరుపతితో కలిసి జెండాను ఆవిష్కరించారు. బాబాయి చెరువుతండా, మద్దిమల్ల గ్రామాల నుంచి 20 మంది మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మహిళా విభాగం మండలాధ్యక్షురాలు జోగుల మంజుల, నాయకులు కాంతయ్య, దొమ్మాటి నర్సయ్య, చంద్రమౌళి, లెంకల లక్ష్మణ్, భూక్య మదన్, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు



గెలుపొందిన క్రీడాకారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలోని మినీస్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రెండో తెలంగాణ స్టేట్ మిడిల్ డిస్టెన్స్ రన్నింగ్ ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. 14–20 బాలబాలికలు పోటీలలో పాల్గొన్నారు. పది మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ అందజేశారు. పీఈటీలు సాయికృష్ణ, అజయ్‌కుమార్, భరత్‌రెడ్డి, నవీన్, మహేశ్, రాజు ఉన్నారు.

ప్రసవానంతరం మానసిక ఆరోగ్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు

సిరిసిల్లటౌన్: ప్రసవానంతరం స్త్రీలకు కల్పించాల్సిన మానసిక ఆరోగ్యంపై జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు గురువారం శిక్షణనిచ్చారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు గర్భిణులు, బాలింతలకు మానసిక ఆరోగ్యంపై కల్పించాల్సిన విషయాలు వివరించారు. మానసిక ఆరోగ్య నిపుణులు రవీనా నింహాన్స్, స్టేట్ కోఆర్డినేటర్ ప్రమీల అవగాహన కల్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, వైద్యులు మహేశ్, సీహెచ్‌వో ఎల్లంకి శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందని ట్యాంక్ మెట్లెక్కిన రైతు



రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకుంటున్న మల్లేశం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన రైతు బింగి మల్లేశం నీటి పారుకం విషయంలో తనపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని బాధిత రైతు ట్యాంక్ మెట్లెక్కాడు. బాధితుడు మల్లేశం తెలిపిన వివరాలు. మల్లేశంకు మండలంలోని నారాయణపూర్ శివారులో దొమ్మరిగడ్డ పంపుల వద్ద మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. మల్లేశం పొలం ప్రక్కన ఎల్లారెడ్డిపేటకు చెందిన శివరాత్రి రాజు, శివరాత్రి రవిలకు ఆరు గుంటల పొలం ఉంది. వారి పొలానికి 2015 నుంచి సాగునీటిని అందిస్తున్నాడు. మల్లేశం పూర్తి స్థాయిలో నీళ్ల ఇవ్వడం లేదని ఆరోపిస్తూ రాజు, రవితోపాటు మరొకరు శివరాత్రి మల్లేశంలు కలిసి బింగి మల్లేశంపై దాడి చేశారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని మల్లేశం పోలీసులను కోరుతున్నాడు.

వైన్స్ దరఖాస్తుకు ఆఖరి మోక

- నేటితో ముగియనున్న టెండర్స్ గడువు
- ఇప్పటికే 1,153 దరఖాస్తులు
- రాష్ట్ర ఖజానాకు రూ.23.06 కోట్ల ఆదాయం
- బోనికొట్టని రుద్రంగి వైన్స్



మద్యం దుకాణాలకు టెండర్ దాఖలు చేస్తున్న మహిళా వ్యాపారులు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని 48 మద్యం దుకాణాలకు నిర్వహిస్తున్న టెండర్ దరఖాస్తు ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఈనెల 4వ తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1,153 దరఖాస్తులు రాగా.. 264 మంది మహిళలు టెండర్లు వేయడం గమనార్హం. జిల్లా నుంచి రాష్ట్ర ఖజానాకు ఇప్పటికే రూ.23.06 కోట్లు చేరాయి. శుక్రవారంతో టెండర్ గడువు ముగియనుండడంతో నేడు అత్యధికంగా వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సాయంత్రం 6 గంటల వరకు టెండర్స్ వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి పంచాక్షరీ వెల్లడించారు.

టెండర్లలో సిరిసిల్ల టాప్

మద్యం టెండర్‌కు శుక్రవారం చివరి రోజు కావడం.. శ్రావణమాసం రావడంతో అత్యధికులు మహిళలతో టెండర్లు వేయించే అవకాశం ఉన్నట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట మూడు సర్కిళ్ల పరిధిలో వైన్స్ వ్యాపారం సాగుతోంది. ఇప్పటి వరకు వచ్చిన వైన్స్‌టెండర్స్‌లో సిరిసిల్లలోని 18 మద్యం షాపులకు 560 దరఖాస్తులు రాగా ఇదే టాప్‌గా నిలిచింది. అనంతరం ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లో 14 దుకాణాలుండగా 310 దరఖాస్తులు, వేములవాడ పరిధిలోని 16 మద్యం దుకాణాలకు 283 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి.

ఎన్ని'కల' వండర్స్

మద్యం అమ్మకాలు ఎన్నికల వేళ అధికంగా ఉంటుందని భావించిన వ్యాపారులు ఎలాగైనా వైన్స్ దక్కించుకోవాలని ఎక్కువగా టెండర్లు వేస్తున్నారు. దరఖాస్తుకు ఒక్క రోజు గడువు ఉండగానే గతేడాది వచ్చిన టెండర్స్ 944 దాటి 1,153కు దరఖాస్తులు చేరాయి. ఇప్పటికే గతేడాది కంటే 209 దరఖాస్తులు అధికంగా వచ్చాయని చివరి రోజు శుక్రవారం టెండర్ గడువు ముగిసేలోగా మరో 300 దరఖాస్తులు వస్తాయన్న ఆశాభావాన్ని అబ్కారీ అధికారులు వెల్లడించారు. సిరిసిల్ల సర్కిల్‌లోని గెజిట్ నంబర్ 14 ఇల్లంతకుంటలోని ఓం శ్రీసాయి వైన్స్ 54 టెండర్లతో టాప్‌లో ఉండగా, సిరిసిల్ల సర్కిల్‌లోని గెజిట్ నంబర్ 8 శ్రీలక్ష్మి నర్సింహ వైన్స్, గెజిట్ జిల్లెల్ల తెలంగాణ వైన్స్ 49 దరఖాస్తులతో ద్వితీయ స్థానంలో ఉన్నాయి. రుద్రంగి మండలం పరిధిలోని రెండు వైన్స్‌లకు ఇప్పటి వరకు టెండర్ దరఖాస్తు రాకపోవడం గమనార్హం. గతేడాది ఈ వైన్స్‌కు తక్కువ దరఖాస్తులు రావడంతో మళ్లీ టెండర్ ప్రకటించారు. వెంకట్రావుపల్లి వైన్స్‌కు 7 దరఖాస్తులు, నిమ్మపల్లి వైన్స్‌కు 8, వీర్నపల్లి వైన్స్‌కు 2 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ప్రత్యేకంగా సదరం శిబిరం పెట్టాలి

- అడిషనల్ కలెక్టర్‌కు దివ్యాంగుల వినతి



వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు

సిరిసిల్లటౌన్: శారీరకంగా ధృడంగా లేని తమకు ప్రత్యేకంగా సదరం క్యాంపు నిర్వహించాలని దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఎస్టీ, ఎస్సీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల దేవరాజు మాట్లాడుతూ గత రెండేళ్లుగా తమకు ప్రత్యేకంగా సదరం క్యాంపు నిర్వహించకపోవడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ప్రతినిధులు మరాఠి అజయ్, ప్యారం లక్ష్మీనారాయణ, మల్లిక్, సరోజ, ముఖేశ్, రామస్వామి, యాదగిరి ఉన్నారు.

గ్రామాల్లో సంపద వనాలు పెంచాలి

- డీఆర్డీవో ఏపీడీ మదన్‌మోహన్



గుంతల తవ్వకం పనులు చూస్తున్న ఏపీడీ

బోయినపల్లి(చొప్పదండి): గ్రామాల్లో సంపద వనాల ఏర్పాటులో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలని డీఆర్డీవో ఏపీడీ మదన్‌మోహన్ కోరారు. మండలంలోని కొదురుపాక, మాన్వాడ, కొత్తపేట గ్రామాల్లో సంపద వనాలు నిర్మించే స్థలాలను గురువారం పరిశీలించారు. మదన్‌మోహన్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాన్వాడ వద్ద ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట పరిసరాల్లో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలు పరిశీలించారు. అనంతరం మర్లపేట గ్రామ బీటీ రోడ్డు పరిసరాల్లో హరితహారం చెట్ల నరికివేతపై పరిశీలించారు. ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో వనం సబిత, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వేములవాడరూరల్: వేములవాడ నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. నూకలమర్రికి చెందిన దేవయ్య ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోర్టులో మందుతాగిన రైతు మృతి

- ఈనెల 1న సంఘటన
- చికిత్స పొందుతూ మృతి



చంద్రశేఖర్(ఫైల్)

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి: భూతగాదాలో వచ్చిన ఫిర్యాదుతో ఎస్సై వేధింపులు తాళలేక సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో ఈనెల 1న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ రైతు చంద్రశేఖర్ గురువారం ప్రాణాలు కోల్పోయాడు. బోయినపల్లి మండలం రత్నంపేటకు చెందిన గురిజాల చంద్రశేఖర్(53)కు, గ్రామంలోని మరొకరితో భూతగాదా ఉంది. ఈ విషయంలో తన వైపు తప్పులేకున్నా స్థానిక ఎస్సై తన ప్రత్యర్థికి అనుకూలంగా వ్యవహరిస్తూ కొట్టాడని ఈనెల 1న సిరిసిల్ల కోర్టు ప్రాంగణంలో క్రిమిసంహారక మందు తాగాడు. వరంగల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. చంద్రశేఖర్ వాంగ్మూలం, పోలీస్ విచారణ ఆధారంగా నిందితులపై రిపోర్టును కోర్టుకు అందిస్తామని సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్ వివరించారు. మృతుడి బంధువులు ఫిర్యాదుతో అదే గ్రామానికి చెందిన ఎడిగ మల్లేశంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి భార్య వసంత, కుమారుడు ప్రేమ్‌కుమార్, కూతురు ఉన్నారు. పిల్లలిద్దరికి పెళ్లిళ్లయ్యాయి. చంద్రశేఖర్ వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసి బతుకుతున్నారు.

ధర్నాలు.. రాస్తారోకోలు

- సిరిసిల్లలో హోరెత్తిన నిరసనలు



కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశవర్కర్లు



రెండో ఏఎన్‌ఎంల దీక్షలు

సిరిసిల్లటౌన్: నిరసనలు..నినాదాలతో సిరిసిల్ల దద్దరిల్లింది. జిల్లా కేంద్రంలో గురువారం నిరసనలు హోరెత్తాయి. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు కలెక్టరేట్ ముట్టడించారు. బీజేపీ నేతలు తహసీల్దార్ ఆఫీసు ముందు ధర్నా చేపట్టగా..అంబేడ్కర్ చౌరస్తాలో రెండో ఏఎన్‌ఎంలు, మాజీ సర్పంచులు వేర్వేరుగా నిరసన దీక్షలు నిర్వహించారు.

పనిభారం తప్పించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాలతో తమపై పెరుగుతున్న పనిభారం తగ్గించాలని ఆశవర్కర్లు కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. వక్తలు మాట్లాడుతూ ఆశవర్కర్ల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనాలు అందించి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే బెనిఫిట్స్ అందించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూశం రమేశ్, ఎలిగేటి రాజశేఖర్, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, రాణి, కస్తూరి, రుచిత, చంద్రకళ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులివ్వాలి

తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ పాలనలో కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంలో బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీసు ముందు ధర్నా చేపట్టి మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో లోపాలు సరిదిద్దడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కొత్త పింఛన్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈమేరకు తహసీల్దార్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ఆడెపు రవీందర్, నాయకులు కైలాష్ శిరస్వాల్, బూర విష్ణు, కోడం ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించండి

దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉంటున్న తమ సమస్యలు పరిష్కరించాలని రెండో ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. పదిహేనేళ్లుగా సేవలందిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామల మల్లేశం, నాయకులు కడారి రాములు, అజ్జ వేణు, పంతం రవి సంఘీభావం తెలిపారు. దీక్షల్లో వనజ, రేణుక, విజయలక్ష్మి, శ్రీలత, పద్మ, మాధవి, రేఖ, రాజేశ్వరి, పద్మ, సరోజ, ఇందిర, కరుణశ్రీ, సునంద తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో రోజు దీక్షలు

మాజీ సర్పంచుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సిరిసిల్లలో చేపట్టిన నిరవధిక రిలేదీక్షలు గురువారం 9వ రోజుకు చేరాయి. వారు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా దీక్షలు చేపడుతన్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. దీక్షల్లో చందనగిరి గోపాల్, వేల్పుల మల్లిఖార్జున్‌రావు, గంగాధర్, రాజేశం, రమేశ్, బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరెళ్ల పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్

- జిల్లాలో ఆరు పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ సర్టిఫికేషన్
- ఎక్కువ ఎన్‌క్వాస్ పొందిన జిల్లాగా గుర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన కలెక్టర్, జిల్లా వైద్యాధికారి



నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వచ్చింది. నేషనల్ హెల్త్ సిస్టమ్ రీసోర్స్ సెంటర్(ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్సీ) నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తే ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ వస్తుంది. దీనికి మూడేళ్ల కాలపరిమితి ఉంటుంది. ఆస్పత్రి అభివృద్ధికి కేంద్రం నుంచి ఏటా రూ.3 లక్షల చొప్పున మూడేళ్లు అందిస్తారు. ఇప్పటికే జిల్లాలో కోనరావుపేట, తంగళ్లపల్లి, బోయినిపల్లి, కొదురుపాక, పీఎస్ నగర్ అర్బన్ పీహెచ్‌సీలు ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ పొందాయి. అతి తక్కువ సమయంలో ఎక్కువ ఎన్‌క్వాస్ సర్టిఫికెట్లు పొందిన జిల్లాగా రాజన్న సిరిసిల్ల గుర్తింపు పొందింది. నేరెళ్ల పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్ రావడంపై మెడికల్ ఆఫీసర్ జిందం రేఖ సంతోషం వ్యక్తం చేశారు.

సిబ్బందికి అభినందనలు

నేరెళ్ల పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు రావడంపై కలెక్టర్ అనురాగ్ జయంతి హర్షం చేశారు. ఇందుకు కృషిచేసిన వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానాల్లో మౌలిక వసతులు, విలువైన వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు.

తీజ్ గిరిజన సంప్రదాయానికి ప్రతీక



తిమ్మాపూర్‌లో నారుబుట్టలతో నాయకులు



గుండారంతండాలో కె.కె.మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తీజ్ పండగ గిరిజన సంప్రదాయానికి ప్రతీక అని సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గుండారంతండాలో గురువారం నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. గిరిజన యువతులు వారం పాటు నిష్టతో పూజలు చేయడం చెప్పుకోదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, రాజునాయక్, గిరిజన నాయకులు హరిలాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ తండాల్లో గురువారం తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిరిలో గోధుమలు నానాబెట్టగా.. మొలకెత్తిన నారును ఊరేగింపు నిర్వహించారు. గిరిజనుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు సీత్యానాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం గోపాలపల్లి, మొర్రాపూర్, సేవాలాల్‌తండాల్లో తీజ్ ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వనదేవతలైన ఏడుగురు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తీజ్‌ను నిమజ్జనం చేశారు. సర్పంచులు శ్రీనివాస్‌నాయక్, నరేశ్, దేవేందర్, భూక్య బాబు, మునియా, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్లలో శుక్రవారం మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనురాగ్‌జయంతి అధికారులను ఆదేశించారు. బైపాస్‌రోడ్డులో నర్సింగ్ కళాశాల కూడలిలో ఏర్పాటు చేస్తున్న పాపన్న విగ్రహ ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులు, గౌడ సంఘం సభ్యులతో మాట్లాడారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలోని 40 కేవీ రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంట్, 130 అదనపు పడకల ప్రారంభోత్సవం ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందించాలి

- బీజేపీ నాయకుల ధర్నా



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి(వేములవాడ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదంటూ తహసీల్దార్ ఆఫీస్ ఎదుట బీజేపీ మండల అధ్యక్షుడు పోంచెట్టి రాకేశ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. బీసీబంధు, దళితబంధు పథకాలను అర్హులకు అందించకుండా అధికార పార్టీ అనుచరులకే ఎక్కువగా ఇస్తున్నారని ఆరోపించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాకేశ్ మాట్లాడుతూ గ్రామాల్లో అసలైన నిరుపేదలను గుర్తించి పథకాలను అందజేస్తే వారి కుటుంబాలను ఆదుకున్నట్లుగా ఉంటుందన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికి వినతిపత్రం అందించారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సిర్రం తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, నాయకులు హన్మయ్యచారి, పెరుకల గంగరాజు, ఓరుగంటి విజయ్, వంకాయల కార్తీక్, గడిగొప్పుల జీవన్, ఎరువా మహేశ్, సిరుకొండ తిరుపతి, మేడిశెట్టి శ్రీహరి, అల్లం శేఖర్ పాల్గొన్నారు.

పాపన్న జయంతి విజయవంతం చేయండి

- గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్



గోవర్ధన్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్లలో ఈనెల 18న నిర్వహించే సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని విజయవంతం చేయాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ కోరారు. ఎల్లారెడ్డిపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఐటీ మంత్రి కేటీఆర్, ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్ గౌడ హాస్టల్ సలహాదారులుగా ఎన్నికైన గోవర్ధన్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండలాధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, నాయకులు గంట శ్రీనివాస్‌గౌడ్, కోల నారాయణగౌడ్, ముష్కం దత్తాత్రిగౌడ్, కొండ రమేశ్‌గౌడ్, బాలరాజు సర్వాగౌడ్, గంట వెంకటేశ్‌గౌడ్, గంట అంజయ్యగౌడ్, గంట బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రసాద్



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్ కోరారు. గంభీరావుపేటలో టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదును గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతి సమస్యలతోపాటు 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. మండలాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, జిల్లా కౌన్సిలర్ గంధ్యాడపు శ్రీనివాస్, రాంచంద్రం, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.